


# వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యానగర్

## నేను చదివిన పుస్తకం

(విద్యార్థుల పుస్తక సమీక్షల సంకలనం)





భాషా దినోత్సవాల ప్రత్యేకం

# నేను చదివిన పుస్తకం

## (విద్యార్థుల పుస్తక సమీక్షల సంకలనం)


**సంపాదకులు**

డా.జె భారతి

అధ్యక్షులు, తెలుగు శాఖ

**సంపాదక సహకారం**

కళాశాల తెలుగు సంఘు సభ్యులు


భాషా దినోత్సవాల ప్రత్యేకం

# విషయ సూచిక

1. ముందుమాట

2. తెలుగు భాషా దినోత్సవం

3. తెలంగాణ భాషా దినోత్సవం

## విద్యార్థుల సమీక్షలు

1. నేస్తమా... జయమ్ము నిశ్చయమ్ము – నరేశ్

2. వీరవల్లడు – అభిలాష్

3. పెద్ద బాల శిక్ష – రఘువర్దన్

4. ఉడతమ్మ ఉపదేశం - సాయి కుమార్

5. వండర్ మెమరి టెక్నిక్స్ - వినయ్

6. ఉషాపరిణయం – మాధవి

7. ప్రేరణాత్మక కథలు – పుష్ప

8. కన్యాశుల్కం – బి. నవ్య

9. మన పండుగలు – మహేశ్

10. అందరినీ ఆకట్టుకునే కళ – ఉమారాణి

# ముందుమాట

సీ. ఒక్క సంగీతమేదో పాడునట్లు
భాషించినపుడును విన్పించు భాష
విస్పష్టముగ నెల్ల విన్పించునట్లు
స్పష్టోచ్చారణంబున నొనరు భాష
రసభావముల సమర్ణ శక్తియందున
నమర భాషకు దీటైన భాష
జీవులలోనున్న చేవయంతయు చమ
త్కృతి పల్కులన్ సమర్పించు భాష

తే. భాషలొక పది తెలిసిన ప్రభువు చూచి
భాషయన నిద్దియని చెప్పబడిన భాష
తనర ఛందస్సులోని యందమ్ము నడక
తీర్చి చూపించినట్టిది తెలుగు భాష

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

భాష మౌఖికంగా, లిఖిత రూపంగా ఒకరినుంచి మరొకరికి, మరొక తరానికి అందుతుంటుంది. ఎన్నో శతాబ్దాల నుండి తెలుగులో లిఖిత రూపాన్ని పొందిన అనంతమైన విషయాలను, అపారమైన జ్ఞానాన్ని చదివి గ్రహించే సామర్థ్యం కలిగిన తెలుగు విద్యార్థుల సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతోంది. అందుకు ప్రధాన కారణం పుస్తకం చదివే అలవాటు తగ్గి పోవడం. కానీ భాషా పరిరక్షణ, నైతిక విలువల పరిరక్షణ పుస్తక పఠనం ద్వారానే సాధ్యం. చినిగిన చొక్కా అయినా తోడుక్కో ఒక్క పుస్తకమైనా కొనుక్కో అన్న పెద్దలమాట ఆధునిక సాంకేతికతతో మారిపోయింది. చినిగిన చొక్కా తొడుక్కున్నా పర్వాలేదు కానీ సెల్ ఫోన్ లేకుండా ఉండటం కష్టమైపోయిన తరాన్ని చూస్తున్నాం.

ఈ పరిస్థితుల్లో విషయ జ్ఞానానికే కాదు పుస్తక రూపానికి కూడా ఇంటర్నెట్ కేర్ ఆఫ్ అడ్రస్ గా మారిపోయింది. రాజు వద్దకు కొండ రాకపోతే కొండ దగ్గరకు రాజే వెళ్ళాలనేది ఒక సామెత. దీని ప్రకారం పుస్తకం వైపు చూడని వారికి వారు చూస్తున్న ఫోన్ లోకే పుస్తకం చేర్చి అందించాలి. అలా చేయటం వలన విద్యార్థులు విషయ జ్ఞానాన్ని కోల్పోకుండా ఉంటారు. ఆ ప్రయత్నంలో భాగమే ఈ e - పుస్తకం.విద్యార్థులలో పఠనాసక్తి పెంచడానికి, వారు చదివిన పుస్తకాలపై అభిప్రాయాలను పంచుకోడానికి అవకాశం కల్పిస్తూ చేసిన ప్రయత్నం ఈ సమీక్షా వ్యాసాల సంకలనం. ఈ సమీక్షా వ్యాసాల రచయితలకు శుభాభినందనలు వీరు అందించిన స్ఫూర్తితో పుస్తకం చదివి, దాని గురించి సమీక్షించడానికి మరికొందరు ముందుకు వస్తారని విశ్వసిస్తున్నాను.

సమీక్షా సంకలనం ఆలోచనను అభినందించి ప్రోత్సహించిన ప్రధానాచార్యులు డా. జి. సుకన్య గారికి , సహకరించిన తెలుగు శాఖ అధ్యాపకులకు, తెలుగు విద్యార్థి సంఘు సభ్యులకు ధన్యవాదాలు.

భాషా దినోత్సవ శుభాకాంక్షలతో

డా. జె. భారతి

అధ్యక్షులు, తెలుగు శాఖ,

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల

విద్యానగర్

# తెలుగు భాషా దినోత్సవం
# (గిడుగు రామమూర్తి పంతులు జయంతి ఆగస్టు 29)

తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు వెంకట రామమూర్తి .



గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, విలునూతెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగష్టు 29 ని "తెలుగు భాషా దినోత్సవం"గా జరుపుకుంటున్నాము.

**జననం:**

గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగస్టు 29 వ తేదీ శ్రీకాకుళానికి ఉత్తరాన ఇరవైమైళ్ళ దూరంలో ముఖలింగ క్షేత్రం దగ్గర ఉన్న పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించాడు. అతని తండ్రి వీర్రాజు, తల్లి వెంకమ్మ. వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో సముద్దారు (రివెన్యూ అధికారి) గా పనిచేస్తుండేవాడు. 1875 దాకా ప్రాథమిక విద్య ఆ ఊళ్ళోనే సాగింది.

**విద్య, ఉద్యోగం:**

విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ రామమూర్తి మహారాజా వారి ఇంగ్లీషు పాఠశాలలో ప్రవేశించి 1875 మొదలు 1880 వరకు విజయనగరంలో గడిపాడు. 1879 లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ రోజుల్లో గురజాడ అప్పారావు రామమూర్తికి సహాధ్యాయి.

ఆ ఏడే రామమూర్తికి పెళ్లి అయింది. 1880లో ముప్ఫై రూపాయల జీతం మీద పర్లాకిమిడి రాజావారి బళ్ళో ఫస్టుఫారంలో చరిత్ర బోధించే అధ్యాపకుడైనాడు. సంసారబాధ్యత (తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు) రామమూర్తి పై బడింది. ప్రైవేటుగా చదివి 1886 లో ఎఫ్.ఏ., 1894 లో బి.ఏ. మొదటి రెండు భాగాలు ఉత్తీర్ణుడయ్యాడు. 1896 లో మూడోభాగంలో ఉత్తీర్ణుడై పట్టం పుచ్చుకున్నాడు. ఇంగ్లీషు, సంస్కృతాలు గాక, ప్రధాన పాఠ్యాంశంగా చరిత్ర తీసుకుని రాష్ట్రంలో మొదటి తరగతిలో, రెండోర్యాంకులో ఉత్తీర్ణుడయ్యాడు. రాజావారి ఉన్నత పాఠశాల కళాశాల అయింది. అప్పుడు అతనికి కళాశాల తరగతులకు పాఠాలు చెప్పే యోగ్యత వచ్చింది.

**సవర భాషా పాండిత్యం:**

ఆరోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నాడు. ఈ పరిశ్రమ చాలా ఏళ్ళు జరిగింది. సవరభాషలో పుస్తకాలు వ్రాసి, సొంతడబ్బుతో బళ్ళు పెట్టి, అధ్యాపకుల జీతాలు చెల్లించి, సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913 లో "రావు బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నాడు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931 లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్ని, 1936 లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించాడు.

**పురస్కారాలు:**


1934 లో ప్రభుత్వం *కైజర్ ఎ హింద్* బిరుదు ఇచ్చి గౌరవించింది.

1913 లో ప్రభుత్వం *రావు సాహెబ్* బిరుదు ఇచ్చింది.

1938 లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు *కళాప్రపూర్ణ*తో గౌరవించింది.

# తెలంగాణ భాషా దినోత్సవం
## (ప్రజాకవి కాళోజీ జయంతి సెప్టెంబర్ ౯)

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ "కాళోజీ నారాయణరావు లేదా కాళోజీ లేదా కాళన్న"గా సుపరిచితులు. అతను తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడబడతాడు. అతను రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం.కవిత్వం వ్రాసిన ప్రజాకవి. హక్కులడిగిన ప్రజల మనిషి. ఉద్యమం నడిపిన ప్రజావాది. మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి



కాళోజి. పుట్టుక, చావులు కాకుండా బతుకంతా తెలంగాణ కిచ్చిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అతను తన కలం ఎత్తాడు. అతను స్వాతంత్ర్యసమరయోధుడు, తెలంగాణా ఉద్యమకారుడు. అతను 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ పొందాడు. అతను జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి అతను పేరు పెట్టబడింది అలాగే హన్మకొండ పట్టణంలో కాళోజీ కళాక్షేత్రం పేరిట ఒక ఆడిటోరియంను నిర్మిస్తున్నారు.

**రచనలు:**

అతను మరాఠీ, ఇంగ్లీషు భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు.

అణా కథలు, నా భారతదేశయాత్ర, పార్థివ వ్యయము, కాళోజి కథలు, నా గొడవ, జీవన గీత, తుదివిజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ!బాపూ!!బాపూ!!! అనేవి కాళోజీ ముఖ్య రచనలు.

**తెలంగాణా వాదం**

•నిజాం ఆగ్రహించి కాళోజికి వరంగల్ నగర బహిష్కారం విధించిండు. కాళోజి మరింత తీవ్రంగా అంకితభావంతో అక్షరం సంధించిండు. 1939 ల, 1943 ల రెండుసార్లు జైలుకి పోవాల్సివచ్చింది.

•ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు పాములపార్తి సదాశివరావుతో కలిసి తెలంగాణా ప్రత్యేక సంచిక వెలువరించాడు. విశాలాంధ్ర కావాలనీ అన్నాడు. తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ప్రత్యేక తెలంగాణా కావాలనీ అన్నాడు.

•ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంద్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది.

•పి.వి.నరసింహారావు లాంటి ఎందరికో అతను సాహిత్యంల, రాజకీయాల్లో మార్గదర్శనం చేసాడు.

•విశాలాంధ్ర సమస్యలు గమనించి అతను1969 ల ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు.

•అన్ని సందర్భాలల్లా అసలుసిసలైన తెలంగాణవాదిగా జీవించాడు.

**పురస్కారాలు:**

1992 : పద్మవిభూషణ్ – భారత రెండవ అత్యున్నత పురస్కారం

1972 : తామ్రపత్ర పురస్కారం.

1968 : "జీవన గీత" రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారం.

బూర్గుల రామకృష్ణారావు మెమోరియల్ మొదటి పురస్కారం.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే 1981లో సత్కారం.

"ప్రజాకవి" బిరుదు.

కాళోజీ 2002 నవంబర్,13 న తుదిశ్వాస విడిచాడు.

# విద్యార్థుల పుస్తక  సమీక్షలు

# 1. నేస్తమా... జయమ్ము నిశ్చయమ్ము

సమీక్షకులు: నరేష్ రచయిత : ఎ.జి. కృష్ణమూర్తి

బిఎస్సీ ద్వితీయ సంవత్సరం (ఎంపిసిఎస్)

"ప్రతి వ్యక్తిలో ఒక విజేత దాగి ఉన్నాడు. ఆ విజేతను వెలికితీసి విజయులై సుఖ సంతోషాలతోపాటు, నలుగురుకి స్ఫూర్తిదాయకం కావడం మనందరి విద్యుక్త ధర్మం. నిజానికి విజేత కావడం మనందరి జన్మహక్కు దాన్ని నేలరాసి, నిరర్థకంగా మిగిలిపోవడం మనం చేజేతులా కొని తెచ్చుకున్న దౌర్భాగ్యం.

విజేతలు, విజయాలు,... ఈ పదాలు, ఈ పదాలకు ప్రతీకలుగా నిలిచే వ్యక్తులు, సంఘంలో మనందరికీ ఎంతో ఎత్తుగా, అందనివారిగా గోచరిస్తారు. విజయాలను సొంతం చేసుకున్నవారు ప్రత్యేక వ్యక్తులుగా, అందరికంటే భిన్నంగా నిలబడతారు." ఇటువంటి వాక్యాలు ఈ పుస్తకంలో కోకొల్లలుగా కనబడతాయి. వాటిలో ముత్యాల్లాంటి వాటిని కొన్నింటిని ఏరి పుస్తకం గురించి పరిచయం చేసే ప్రయత్నమే నా ఈ చిన్ని సమీక్ష.

<u>రచయిత పరిచయం:</u>

ముద్ర కమ్యూనికేషన్ లిమిటెడ్ ఫౌండర్, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎ.జి. కృష్ణమూర్తి గారు ఈ పుస్తకాన్ని రచించారు. 35000 రూపాయల మూలధనంతో ఒకే క్లయింటుతో ఏజెన్సీ ప్రారంభించాడు. కేవలం తొమ్మిది సంవత్సరాలలో భారతదేశంలోని అడ్వర్టయిజింగు ఏజన్సీలలో 'ముద్ర' ప్రథమ స్థానాన్ని చేరుకోగలిగింది.

ఆంధ్రప్రదేశ్ లోని ఏనుగొండలో ఏప్రిల్ 28, 1942న కృష్ణమూర్తి జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. 1960-70 ల మధ్య కాలంలో చాలా పేరున్న కేలికొమిల్స్ టెక్స్ టైల్స్ కంపెనీలో పని చేశారు. 1968లో అదే కంపనీ లోని శ్రీమతి గిరాబెన్ శారభాయి గారి అసిస్టెంటుగా చేరారు. ఇదే కంపనిలో 1972లో అడ్వర్టైజింగ్ ఏజన్సీలో అకౌంట్సు ఎగ్జిగ్యూటివ్ గా చేరారు. 1976లో అడ్వర్టటైజింగు మేనేజరుగా రిలయన్స్ ఇండస్ట్రిలో చేరారు. నాలుగేళ్ల తర్వాత మార్చి 25, 1980న ఆయన ముద్ర కమ్యూనికేషన్ ను ప్రారంభించారు.

ఏజన్సీ ప్రధానమైన బ్రాండ్లలో రెండు బ్రాండ్లు విమల్ ఫాబ్రిక్, రస్నాసాఫ్ట్ డ్రింక్ కాన్సట్రేట్ లు. వీటికి ప్రారంభ దశ నుండి భారతదేశపు అగ్రగామి బ్రాండ్లుగా గుర్తింపు పొందేవరకు బాధ్యత వహించింది ఆయనే. విమల్, రస్నాలతో పాటు వివిధ రంగాలలో మరెన్నో బ్రాండ్లు అగ్రగాములుగా నిలిచిపోయాయి. 1991 మార్చిలో ఆయన 'ముద్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్, అహ్మదాబాదు' (మైకా) ను స్థాపించారు. అప్పట్లో ఇది ఆసియాలోనే ఏకైక అడ్వర్టైజింగ్ ఇన్స్టిట్యూట్. భారతీయ అడ్వర్టైజింగ్ పరిశ్రమకు అవసరమైన సుశిక్షితులైన ప్రతిభావంతులను అందించటం కోసం మైకా స్థాపన జరిగింది.

ఈయనకు ఇరవై మూడేళ్ళ వయసులోనే ఎన్నో బహుమతులు, అవార్డులు వచ్చాయి. వీటిలో ఏజన్సీ ఆఫ్ ది ఇయర్, పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు ముఖ్యమైనవి.

కృష్ణమూర్తి గారు ఏజీకే బ్రాండు కన్సల్టింగు ఛైర్మన్ గా పని చేస్తూ ఉండగా హైదరాబాదులో 2006లో తుది శ్వాస విడిచారు.

ఈ పుస్తకంలో రచయిత వివరించిన అనేక విషయాలలో కొన్నింటిని కింద పరిచయం చేస్తాను.

1. <u>కాలంతో మారితేనే గెలుపు:</u>

నిరంతరం చోటు చేసుకుంటున్న పరిణామాలను ఎలా స్వీకరించి వాటిని ఎలా ఉపయోగించుకుంటున్నాం అనే విషయంపై, మన విజయాలు, పరాజయాలు ఆధారపడి ఉంటాయి. సమాజంలో మార్పులకనుగుణంగా మారటమే (flexibility to adapt to the market) వ్యక్తుల, సంస్థల విజయానికి మొదటి మెట్టు . కొత్త విద్యలు నేర్చుకోక, ఉన్న ప్రజ్ఞా పాటవాలకి విలువ పోయి, దిక్కు తోచని పరిస్థితులలో కొట్టు మిట్టాడుతున్న వారు ఎందరో మార్పులను అంగీకరించి, కొత్త ప్రతిభా పాటవాలను కైవసం చేసుకొని , అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లడమే నేడు మనందరికీ ఉన్న ఒకే ఒక దారి.

2, మంచికి మంచి రోజులు:

ప్రతి మనిషికి మంచి మనిషితో  సంబంధాలు పెంచుకోవాలనే కోరిక ఉంటుంది కనుకే మంచి వ్యక్తిగా మారటం మన కనీస కర్తవ్యంగా తెలుస్తుంది. కాబట్టి మనల్ని మనం మంచి వ్యక్తులుగా మలచుకోవాలి. ఎదుటివారికి ఉపకారం చేసే వాడిని మంచివాడిగా, అపకారం చేసే వాడిని చెడ్డ వాడిగా భగవద్గీత పేర్కొంది. కృషితో నాస్తి దుర్భిక్షం కాబట్టి, మన కృషిని మెరుగుపరుచుకుని మంచివాడిగా గుర్తింపు పొందవచ్చు.

3. నేటి పని నేడే:

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోకావాలి అనే పలు ఉపమానాలు మనకు ఉన్నాయి ఇవన్నీ మనకు చెప్పేది ఏమిటంటే పనులను వాయిదా వేయకుండా ఎప్పటి పని అప్పుడు పూర్తిచేయాలి. కొంతమంది అన్నింటినీ వాయిదా వేస్తూ సరైన సమయంలో ఏ నిర్ణయం తీసుకోక అవకాశాలు వదులుకుంటారు. నిర్ణయాలు తొందరగా తీసుకోవాలంటే విషయ పరిజ్ఞానం అనుభవం అత్యంత అవసరం.

4. స్పష్టత:

స్పష్టత అంటే మనకు ఇష్టమైనది ఏదో మనమే తెలుసుకోవడం. కలలు కనే ప్రతి వారికి ఒక ముఖ్య అవసరం స్పష్టత. ఆలోచనలలో స్పష్టత, అవగాహనలో స్పష్టత, గమ్యం పై స్పష్టత, ఆ గమ్యం లోని వివిధ మజిలీల పై స్పష్టత ఇవన్నీ మనకు తప్పకుండా ఉండాలి. ఇష్టమైన రంగంలో కష్టపడితే ఫలితాలు విజయాలు రాకుండా ఉండవు కదా!

5 బాధ్యతలు, సాకులు:

తప్పులు ఒప్పుకోని వాళ్ళు, చేసిన తప్పులు గ్రహించి వాటి నుంచి పాఠాలు నేర్చుకునే వాళ్ళు, తమ తప్పులను ఇతరులపై వేసి సాకులు చెప్తూ తప్పులు జరగటం సహజం అని చెప్పేవారు ఇలా ఒకరేమిటి రకరకాల వ్యక్తులతో నిండి ఉంది నేటి సమాజం. కింద పడటం పైకి లేవటానికి అని భావించి తప్పులు రేపటి విజయానికి సోపానాలు అన్నవారు కొందరున్నారు. వారు అన్ని తప్పులు చేయటంలో వాటి నుంచి పాఠాలు నేర్చుకోవటం లో ఎలాంటి తప్పు లేదని గ్రహించడం మనకెంతో మేలు చేస్తుంది. బాధ్యతలు స్వీకరించి గమ్యం చేరి, దృఢనిశ్చయంతో కృషి చేసే వాడు విజేత అవుతాడు. ఏ కొంచెం ఒడిదుడుకులు ఎదురైనా హెచ్చుతగ్గులు వచ్చినా సాకులు చెప్పి తప్పించుకునేవాడు పిరికివాడు అవుతాడు. తప్పు జరిగిపోయింది ఇకముందు జరగదు అని చెప్పేవారు మనకు చాలా అరుదుగా కనబడతారు అందుకే విజేతలు కూడా అరుదుగా కనబడతారు.

6. ప్రతి సమస్యకు పరిష్కారం:

ఏదైనా ఒక నూతన విషయాన్ని లేదా సమస్యను పరిష్కరించాల్సి ఉన్నప్పుడు ఆ విషయం పై లేదా ఆ సమస్యపై పూర్తి అవగాహన పొంది ఉండాలి.  ఆ అవగాహన సాధించటం కోసం ఆ విషయం పట్ల పూర్తి పరిశోధన చేయాలి. ఇలా పరిశోధనలు చేసే సమయంలోనే మనకు ఆ సమస్య లేదా ఆవిషయాన్ని సాధించుటకు అనేక పరిష్కారాలు లభిస్తుంటాయి. వాటిలో ఉత్తమమైంది మనం ఎంపిక చేసుకోవాలి.

7. అతివృష్టి – అనావృష్టి:

గెలిచినప్పుడు అత్యుత్సాహం పొందటం, ఓడినప్పుడు పాతాళం లోకి చొచ్చుకు పోయినాను అనుకోవడం మన జీవితాన్ని నాశనం చేస్తుంది. ఆటుపోట్లు లేని జీవితాలు ఎవరికీ ఉండవు కదా! రెండింటికీ విపరీత ధోరణి లో స్పందిస్తే కష్టాలను కొని తెచ్చుకోవడమే అవుతుంది. ఈ నిజాన్ని గ్రహించి ఇతరులకు మార్గదర్శకులుగా నిలబడేది నాయకులు మాత్రమే.

8. అరవైలో ఇరవై:

సాధారణంగా చాలా మంది వయసు ఆరు పదులు నిండాక వారి జీవితం చివరి దశలో ఉందని, కలలు కోరికలు ఉండడం సరికాదని భావిస్తుంటారు. జీవితం మీద అనాసక్తి పెంచుకుని పెరట్లో వాలు కూర్చికి అంకితం కావడం చేస్తూ ఉంటారు. అలా కాకుండా జీవితం ఉన్నంతవరకు చివరి క్షణం దాకా జీవించాలి. అలా జీవించాలంటే వయసు అరవై సంవత్సరాలు ఉన్నాకూడా ఇరవై సంవత్సరాలు ఉన్న వ్యక్తి లాగా  కలలు కంటూనే వాటిని సార్థకం చేసుకునే ప్రయత్నంలో ఉండాలి.

**మలి పలుకు:**

డబ్బులేక కలలు నెరవేరక లేకపోవడం ఒకనాటి మాట. నేడు గమ్యాలు లేకపోవడం ఆత్మవిశ్వాసం లోపించడం అనేవి ప్రగతికి ప్రతిబంధకాలుగా మారాయి. నిద్రాణంగా ఉన్న కలల్ని మేల్కొల్పుతూ ఆత్మవిశ్వాసాన్ని సాధిస్తూ విజయాలను చేరటమే నేటి యువత ముందున్న ఒకే ఒక్క దారి. సామాన్యులుగా మిగిలిపోవడమో అసామాన్యుడిగా, స్ఫూర్తిదాతలుగా, మార్గదర్శకులుగా మారటమో నిర్ణయించుకోవాల్సింది నేటి యువతే. నేడు ఘనవిజయాలు సాధించటం అనేది మనచేతుల్లో దాగి ఉన్న పని. ఎవరి దయాదాక్షిణ్యాలతో పని లేదు. కుల గోత్రాలతో అసలే సంబంధం లేదు. కలలపై విశ్వాసం,  నమ్మకం ఉంచి రాత్రింబవళ్ళు కష్టపడి గమ్యం చేరుకోవడమే మన ముందున్న పని. ఇంతకన్నా

విజేతలకు మరే ఆయుధాలతో వనరులతో పనిలేదు. నడుంబిగించి కార్యోన్ముఖులు కావడం నేటి యువత ముందున్న ఒకే ఒక మార్గం.

అవకాశాలు మనలను వెతుక్కుంటూ రావు వాటిని మనం వెతుక్కుంటూ పోవాలి. జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరి కాదు మనమే మనకు ఇష్టమైనది ఎంచుకుని వడ్డించు కోవాలి. కలలు కనడం వాటిని సాకారం చేసుకోవడం ఒక జీవన విధానం కావాలి. పొరపాటున అపజయం ఎదురైతే రాబోయే విజయాలకు అది తొలి పాఠం కావాలి. నేటి విజేతలందరూ నిన్నటి సామాన్యులే అని గుర్తుంచుకోవాలి. వారి విషయాలు మనకు స్ఫూర్తిదాయకం కావాలి. మనకు చరిత్ర పుటల్లో కొంచమైనా స్థానం ఏర్పడాలి. అప్పుడే ఈ విలువైన జీవితానికి ఒక అర్థం ఏర్పడుతుంది. పదండి ఆ దిశగా... ''ఇఫ్ యు కెన్ డ్రీమ్ ఇట్, యు కెన్ డు ఇట్''.

మీకంటూ ఒక కల ఉంటే అది తప్పక నిజమవుతుంది. అది మన పురోగతికి ఆధారమై మనల్ని విజేతలను చేస్తుంది. ఎందుకంటే విజేతలుగా రూపాంతరం చెందటం మన జన్మ హక్కు ఈ హక్కును సద్వినియోగపరచుకోవడం మన కర్తవ్యం.

ఇలాంటి వ్యక్తిత్వ వికాస పుస్తకాలను చదవటం ద్వారా పైన వివరించిన అనేక రకాలైన స్ఫూర్తి దాయక మాటలను నేర్చుకోగలం. కాబట్టి ఈ పుస్తకాలను చదవటం కూడా మన అలవాటుగా మార్చుకోవాలి.

# 2. వీర వల్లడు(నవల)

సమీక్షకులు: ఎం. అభిలాష్ రచయిత : విశ్వనాథ సత్యనారాయణ

బివస్సీ ద్వితీయ సంవత్సరం (ఎంపిసిఎస్)

వీరవల్లడు అనే పుస్తకం 62 పేజీలతో 19వ శతాబ్దం చివరి కాలాన్ని ప్రతిబింబింప చేసే ఒక చిన్న సాంఘిక నవల. పూర్వ కాలపు కట్టుబాట్లనూ, అప్పటి సంస్కృతీ, సాంప్రదాయాలను కళ్ళకు కట్టినట్టు ఇందులో వివరించారు. యజమానికీ, పాలేరుకీ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ నవల వివరిస్తుంది. ముఖ్యంగా ఇందులో కృతజ్ఞతా భావాన్ని 'వల్లడు' అనే ప్రధాన పాత్ర ద్వారా రచయిత చక్కగా వివరించారు. నేడు మనుషుల మధ్య లోపించిన ఈ భావాన్ని తిరిగి సాధించేందుకు తప్పకుండా చదవాల్సిన, నవల ఇది.

**కవి పరిచయం:**

ఈ నవలను కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు 1935-40 ప్రాంతాల్లో రచించారు. ఈయన పేరు వినగానే మనకు గుర్తొచ్చే మరో ప్రసిద్ధ రచన వేయిపడగలు. దీన్ని పి.వి. నరసింహారావు గారు సహస్రఫణ్ పేరుతో హిందీలోకి అనువదించారు. ఈయన మరో రచన శ్రీమద్రామాయణ కల్పవృక్షం. భారతదేశపు అత్యున్నత సాహితీ పురస్కారం అయిన జ్ఞానపీఠ పురస్కారం దీనికి లభించింది. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి జ్ఞానపీఠ అవార్డు గ్రహీతగా విశ్వనాథ గారు ప్రసిద్ధి చెందారు.

**పాత్ర చిత్రణ:**

ఈ నవలలో పాత్ర చిత్రణ అద్భుతంగా వుంటుంది. ఒక్క వల్లడి పాత్రే కాదు. కరణము, మునుసబు, సాయిబు, దొర, దొర భార్య సర్వలక్ష్మమ్మ గారు, చిన్నపిల్లలు – ఇలా నవలలోని మొత్తం అన్ని పాత్రలూ కళ్ళకి కట్టినట్లుగా వుంటాయి. ఇందులో ఆసక్తి కలిగించే విషయం ఏమిటంటే వల్లడి దొర పాత్రకు పేరు లేదు. నవల ప్రారంభం నుండి చివరి దాకా వల్లడి దొర గానే ప్రస్తావించబడింది.

**నేపథ్యం:**

విశ్వనాథ వారి కుటుంబంలో ఆయనకు రెండు, మూడు తరాల క్రితం జరిగిన వాస్తవ సంఘటనలకు కథారూపమే ఈ నవల అని విశ్వనాథ పావనశాస్త్రి చెప్పుకున్నారు. ఈ నవలను గొర్రెపాటి బాలకృష్ణమ్మకు అంకితం ఇచ్చారు.

**ఇతివృత్తం:**

పట్టణ వాసపు చదువుల్లో చేరిన ఓ పల్లెటూరి బ్రాహ్మణ బాలుడికి పాఠశాలలో మాస్టారు వల్లప్ప అనే తన పేరును వెక్కిరించగా తన పేరంటేనే విరక్తి ఏర్పడుతుంది. సెలవుల్లో ఇంటికి వచ్చినపుడు  తన పేరు మార్చమని తన తండ్రికి చెప్పగా వల్లడనే పాలేరు పేరు పెట్టామనీ అది గొప్ప పేరనీ తండ్రి చెప్తే అతనికి పేరు మార్చుకోవాలని ఇంకా పట్టుదల పెరుగుతుంది. ఈ నేపథ్యంలో తన చిన్నతనంలో వల్లని గురించి దాదాపు ఇదే పరిస్థితుల్లో విన్న కథను ఆయన కొడుక్కి చెప్తాడు. తన దొర మరణానంతరం ఆయన కుటుంబానికి ఆస్తి దక్కకుండా చేసిన దొర బాబాయిని ఒంటరిగా ఎదిరించి, నేర్పుగా వ్యవహారాన్ని చక్కబెట్టి ఎలా ఆస్తి తిరిగి రప్పించాడన్నదే వల్లడి కథ. పందొమ్మిదవ శతాబ్ది తొలినాళ్ళలోని భూవ్యవహారాలు, ఆనాటి కులకట్టుబాట్ల మధ్య ఈ కథను రచయిత నడిపిన తీరు ఆకట్టుకుంటుంది.

**సంక్షిప్త కథ:**

వల్లడు ఒక మాల కులానికి చెందిన పాలేరు. అతని దొర ఒక బ్రాహ్మణుడు. ఆ బ్రాహ్మణుడి పూర్వులలో ఒకాయన ఒక అడవిలాంటి ప్రదేశాన్ని చూసి, అది మంచి ప్రదేశమని గుర్తించి, దానిని ఊరుగా మార్చి అక్కడ నివసించాలని నిర్ణయించుకుంటాడు. మొదట అక్కడ తను ఒక పాక వేసుకుని భార్యా పిల్లలతో కాపురం పెడతాడు. ఆ తర్వాత ఒక రోజు ఆ దారిన పోతున్న వల్లడి పూర్వీకుడు ఆకలితో ఆ పాక దగ్గరికి వస్తే అతనికి ఆ బ్రాహ్మణుడు అన్నం పెడతాడు. ఆ బ్రాహ్మణుడు తన నిర్ణయం అతనితో చెప్పి "నాకు సాయంగా వస్తావా?" అని అడుగుతాడు. ఒక పూట అన్నం పెట్టాడన్న కృతజ్ఞతతో వల్లడి పూర్వీకుడు జీవితమంతా ఆయన దగ్గర ఉండడానికి సిద్ధమై భార్యా పిల్లలని తీసుకుని వచ్చేస్తాడు. ఆ తర్వాత కమ్మవారినీ, ఇతర కులాల వారినీ తీసుకొచ్చి వాళ్ళకి భాగాలు పెట్టి అడవంతా కొట్టి దాన్నొక ఊరుగా తయారు చేస్తారు. అప్పటి నుండి వల్లడి వంశం వారు , ఆ బ్రాహ్మణుడికి తరతరాలుగా పాలేరు పని చేస్తూ వస్తారు. వల్లడి దొర కుటుంబానికి సంబంధించిన పొలం ఉమ్మడిగా వుంటుంది. ప్రతితరం లోనూ పెద్ద కొడుకు సంతానానిదే అధికారం కనుక ఆ లెక్క ప్రకారం వల్లడి దొరదే పెత్తనం కావాలి. కానీ వరుసకి బాబాయి అయిన ఒక పెద్దాయన రాయుడుగారు వుండడం వలన వల్లడి దొర ఆయనకి గౌరవమిచ్చి ఆయన పేరు మీదగానే అంతా నడిపిస్తూ వుంటాడు. అయినా ఆ రాయుడుగారికి మనసులో కొంత అసంతృప్తి వుంటుంది. హటాత్తుగా దొర చనిపోవడంతో రాయుడుగారు పెత్తనమంతా తన చేతిలోకి తీసుకుని, వల్లడి దొర పెళ్ళాం పిల్లల గురించి పట్టించుకోవడం మానేస్తాడు. ఊర్లో పెద్దలందరినీ తనవైపు తిప్పుకుని పొలం మొత్తం తానే అనుభవించాలనుకుంటాడు. తిండికి జరగని పరిస్థితులలో ఆవిడ పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోతుంది. ఆవిడ అన్నదమ్ములూ రాయుడుగారిని ఎదుర్కొనేంత శక్తి లేక చేతులు ముడుచుకు కూర్చుంటారు.

అయితే పాలేరు వల్లడు అలా ఊరుకోలేకపోతాడు. ఆవిడని మళ్ళీ ఊరికి తీసుకు వచ్చి ఆవిడ ఆస్తి ఆవిడకీ, ఆవిడ పిల్లలకీ దక్కేలా చేస్తాడు.

**శైలి:**

కథాప్రారంభ ఘట్టాల్లోని కథాకాలానికి వల్లని కథలోని కథాకాలానికి రెండు తరాల అంతరం ఉంటుంది. రచయిత ఆయా ఘట్టాల్లోని పాత్రల భాషలో చక్కని సూక్ష్మమైన బేధం చూపించారు. నవలలో ఆనాటి గ్రామ వ్యవహారం ఎలా ఉంది అనేది కళ్ళకు కట్టినట్టు చక్కగా వివరించారు.

**ఉదాహరణ సన్నివేశాలు:**

1. "వల్లడు అన్న పేరు చాలా మంచి పేరు. ఒక్కొక్క పేరు - ఒక్కొక్క విధంగా మంచిదోయి. కృష్ణుడు అన్న పేరుందనుకో ఆ పేరు మంచిది కాదని ఎవరూ అనరు కదా! ఎందుకు అనరు? కృష్ణుడు గొప్ప పనులు చేశాడు గనుక. ఆపేరు అందరికీ మంచిది అనిపిస్తుంది." - పేరు మార్చమని అడిగిన వల్లడికి అతడి తండ్రి చెబుతున్న మాటలివి. పేరు గురించి, పేరు ప్రాధాన్యత గురించి ఈ మాటల్లో రచయిత వివరించారు. మన పేరును మనం ఎప్పుడూ చులకన భావంతో, తక్కువచ్చేసి చూడరాదు అన్న విషయాన్ని ఈ మాటల ద్వారా గ్రహించవచ్చు.
2. "ఊరు మీద ఊరు పడ్డా కరణం మీద కాసు పడదు, ఎదుటి వాడి మేలు ఓర్వకపోతే మన సరదా మంటగలుస్తుంది, " - ఈ మాటలు గ్రామ కరణం తో రంగమ్మ అనే ఆవిడ అంటుంది. ఈమె మాట్లాడే మాటలు మంచి నైతికతను బోధించేవిగా ఉంటాయి.
3. "ఒసేయ్! పెడతానో పెట్టనో తెలియని అన్నానికే వెంటబడుతున్నావే నువ్వు. తరతరాలుగా మా దొరల నీడన దొరల్లాగా బ్రతికిన వాళ్ళం మేము నేనెట్టాపడాలి మా దొరల వెంట?" ఈ మాటలు వల్లడు ఒక కుక్కను చూసి అన్నాడు. వల్లడు తన దొరసానిని వెతుకుతూ వెళ్ళినపుడు మధ్యలో ఆహారం ఇచ్చి ఒకావిడ సహాయపడుతుంది. కానీ తన దొరసానిని ఇంటికి తీసుకొచ్చే

వరకు భోజనం చేయకూడదని శపథం చేసుకొని ఉంటాడు వల్లడు. తద్వారా ఆ ఆహారాన్ని ఒక చెరువు గట్టు వద్దకు తీసుకువెళ్తూ ఉంటే ఆ ఆహారం కోసం ఒక కుక్క వెంబడించినపుడు ఆ కుక్కను చూసి వల్లడు ఈ మాటలు అంటాడు. ఈ మాటలను బట్టి ఆ యజమానికి, పాలేరు వల్లడికి మధ్య ఎంత పటిష్టమైన అవినాభావ సంబంధం ఉందో తెలుస్తుంది. ఇలాంటి మాటలు ఈ నవలలో కోకొల్లలుగా ఉంటాయి.

**నవల పై నా అభిప్రాయం:**

నవల చాలా చిన్నది కాబట్టి సమయం వెచ్చించి చదివితే రెండు లేదా మూడు గంటల్లో పూర్తి నవలను చదవవచ్చు. కానీ వివరించాలి అంటే ఒక్కరోజైనా తక్కువే. ఈ నవలలో వల్లడు అనే పాత్ర నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. కృతజ్ఞతా భావాన్ని ఎలా అలవర్చుకోవాలో ఈ పాత్ర తెలియజేసింది. సాటి వ్యక్తి చేసిన సహాయానికి కృతజ్ఞుడిగా ఎలా ఉండాలో ఈ పాత్ర వివరించింది. ఇంకా ఇందులోని ప్రతి సన్నివేశం మన కట్టుబాట్లను ప్రతిబింబించేవిగా ఉంటాయి. పూర్వకాల సంప్రదాయాలు, ఆనాటి కట్టుబాట్లను తెలుసుకోడానికి ఒక చక్కని పుస్తకం ఇది. ఆధునిక సమాజంలో నాటి సంప్రదాయం పట్ల ఉన్న అనేక అపోహలను తొలగించేదిగా ఈ నవల ఉంది.

# 3. పెద్ద బాలశిక్ష

సమీక్షకులు: రఘువర్ధన్

రచయిత : గాజుల సత్యనారాయణ

బీకాం ద్వితీయ సంవత్సరం

గాజుల సత్యనారాయణగారు రాసిన ఈ పుస్తకం ప్రతిఒక్కరికి ఉపయోగపడేది. ఇందులో ఉండే అంశాలు చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకు అందరినీ ఆకర్షిస్తాయి. నేను ఈ పుస్తకం చదివేటపుడు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా గ్రహించేలా ఈ పుస్తకం నన్ను ప్రేరేపించింది. నేను చిన్న పిల్లలకు సంబంధించిన అంశాలను చదివాను. కథలు, అభినయ గేయాలు, సామెతలు ఇలా  అన్నీ నన్ను ఆకర్షించాయి. ఇందులో పురాణాలు కూడా చదివాను. ఈ పుస్తకం చదివితే చాలు అన్నీ విషయాలు తెలుసుకోవచ్చు. తెలుగు అక్షరాలు, అభినయ గేయాలు, నీతి కథలు, పంచతంత్ర కథలు, తెలుగు వ్యాకరణం, తెలుగు వ్యాసాలు, విజ్ఞాన విషయాలు, శతక పద్య రత్నాలు, సామెతలు, పొడుపు కథలు, పురాతన నిఘంటువులు, తాళపత్ర విజ్ఞాన నిధి, భాగవతం, శ్రీమద్రామాయణం, శ్రీమద్మహాభారతం, అష్టాదశ పురాణాలు ఇలా ప్రతీ అంశం ఈ పుస్తకంలో ఉన్నాయి ఇవన్నీ మనం చదవాల్సిన అంశాలు. విజ్ఞాన సంబంధిత అంశాలు కూడా ఇందులో చాలా ఉన్నాయి. అవన్నీ చదువుతుంటే నన్ను ఎంతో ఆకర్షించాయి.

ఈ పుస్తకంలో ఉండే సామెతలు, జాతీయాలు హాస్య భరితంగా ఉండి, పాఠకులను ఆకర్షింపజేసెవిగా ఉన్నాయి. ఇందులోని నీతి కథలు చదివినపుడు నాలో ఏదో తెలియని ఉత్సాహం కలిగింది.  ఈ పుస్తకం చదవటం పూర్తయ్యాక జీవితానికి సరిపడే దాదాపు అన్నీ విషయాల గురించి పరిచయం చేసుకున్నాననే అనుభూతి కలిగింది. మరో విధంగా చెప్పాలంటే

అన్నీ విషాయలు తెలుసుకున్నాననే గర్వం కూడా కలిగింది. ఎందుకంటే ఈ పుస్తకం నన్ను ఆ విధంగా ప్రేరేపించింది. నాకు తెలియని ఎన్నో విషయాలు నా జీవితానికి అవరమయ్యే దాదాపు అన్నీ విషయాలు తెలుసుకోగలిగాను. ఇతర పుస్తకాలు ఏదో ఒక్క అంశాన్ని మాత్రమే కలిగి ఉంటే ఈ పుస్తకం మాత్రం అనేక సమగ్రమైన అంశాలను కలిగి ఉంది. అన్నీ పుస్తకాల సమగ్ర గ్రంథంలా అనిపించింది. ఈ పుస్తకం చదివిన తర్వాత పొందిన అనుభూతి అంతముందు చదివిన అన్నీ పుస్తకాల అనుభూతులకు సమానం అనిపించింది. ఇందులో చదివిన చాలా విషయాలు నేను రాత్రి పడుకునే ముందు కూడా ఆలోచింపజేశాయి. ఒక విషయాన్ని మనం ఎందుకు పాటించాలి? దానికి గల కారణాలేమిటి? అనే విషయాలు ఇందులో కూలంకశంగా వివరించారు.

నేటి ఆధునిక సమాజానికి మార్గదర్శకులుగా ఉండే ప్రతీ ఒక్కరూ ముఖ్యంగా నేటి యువత ఈ పుస్తకాన్ని తప్పకుండా చదవాలి. యువతలో ఉత్సాహాన్ని, విశ్వాసాన్ని నింపే ఈ పుస్తకాన్ని తప్పకుండా చదవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 4. ఉడతమ్మ ఉపదేశం

సమీక్షకులు: సాయి కుమార్ రచయిత : రావూరి భరద్వాజ

బిఎస్సీ ద్వితీయ సంవత్సరం(ఎంపిసిఎస్)

ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ ద్వారా ప్రచురితమైన ఈ పిల్లల కథల పుస్తకం లో 7 కథలు ఉన్నాయి ఇందులోని ప్రతి కథ బాల లో నైతిక విలువలను పెంపొందించడానికి దోహదపడుతుంది. మరియు వారికి వినోదాన్ని కలిగించే విధంగా ఈ కథలు ఉన్నాయి. బాలలకు విద్య వైజ్ఞానిక సాంస్కృతిక రంగాలలో క్రమ వికాసం కలిగించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1976లో ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ స్థాపించింది. అందులో భాగంగానే రావూరి భరద్వాజ గారి చే రచించబడిన ఈ కథల పుస్తకం ప్రచురితమైంది. ఈ పుస్తకంలో ఉడతమ్మ ఉపదేశం, కనువిప్పు, విశ్వాసం, పశ్చాత్తాపం, ఉత్తమ జన్మ, కన్న ప్రేమ అనే ఏడు కథలు ఉన్నాయి.

కవి పరిచయం:

రావూరి భరద్వాజ తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరుతెచ్చుకున్నాడు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించాడు. ఈయన బాలసాహిత్యంలో కూడా విశేషకృషి సలిపాడు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింపబడుతుంది. దీనికి భారత అత్యున్నత సాహితీ పురస్కారం అయిన జ్ఞానపీఠ అవార్డు 2013లో లభించింది. ఈయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన.

## ఉడతమ్మ ఉపదేశం:

ఈ పుస్తకంలో ఉన్న ఒక కథను సంక్షిప్తంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

గోదావరి నదీ తీరపు అడవుల్లోని ఒక చెట్టు తొర్రలో ఒక ఉడత తన ఉడతబ్బాయి నివసించేవి. అడవుల్లో దొరికే కాయలు వంటివి తిని తనతో పాటు తన కుమారుడు కడుపు నింపేది. ఒకసారి అటుగా జంతు సందర్శనకు వచ్చిన మానవులు తమ వెంట తెచ్చిన పండ్లు మిఠాయిలు తాము తిని మిగిలినవి చెల్లాచెదురుగా పడేసి వెళ్లిపోయారు. వాటిని రుచి చూసిన ఉడతబ్బాయి నాకు ఇకపై అలాంటివి భోజనం లేక పోతే తనతో పాటు ఉండని మారాం చేస్తాడు. దానికి అలవాటు పడకూడదు కష్ట పడుతూ జీవించాలి. అడిగినట్టు నువ్వు పెడతాను కానీ నువ్వు కూడా నన్ను ఇలానే చూసుకోవాలి అనిచెప్తే తన తప్పును ఉడతబ్బాయి తెలుసుకుంటుంది.

ఇటువంటి పుస్తకాలను చదవటం ద్వారా నైతిక విలువలు పెంపొందుతాయి. చిన్నపిల్లలకు అర్థమయ్యే భాషలో ఉన్న ఈ కథలు చాలా అద్భుతంగా ఉన్నాయి. ఇటువంటి పుస్తకాలు చదవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 5. వండర్ మెమరి టెక్నిక్స్

సమీక్షకులు: వినయ్

రచయిత : సాగర్ సింధూరి

బీఎస్సీ ద్వితీయ సంవత్సరం (ఎంపిసీస్)

ఈ పుస్తకంలో జ్ఞాపకశక్తి మెరుగుపరచుకోవడం ఎలాగో వివరించారు. మన మెదడు ఒక విషయాన్ని ఎలా నిక్షిప్తం చేసుకుంటుంది అనేటటువంటి విషయాలను చర్చించారు. అవసరమైనపుడు సమాచారాన్ని గుర్తు చేసుకోవడం, విద్యార్థులు తమ జ్ఞాపక శక్తితో కొత్త పదాలను గుర్తించుకోవడం, కొత్త భాషను నేర్చుకోవటం వంటివి ఎలా చేస్తున్నారో ఈ పుస్తకంలో వివరించారు. ఈ పుస్తకాన్ని సాగర్ సింధూరి గారు రచించారు. కార్తికేయ పబ్లికేషన్స్ ప్రచురించారు.

**సారాంశం:**

మన శరీరంలో ముఖ్యమైన అవయవం మెదడు దీనిని సరిగ్గా వాడినట్లైతే ఒక వ్యక్తి తాను అనుకున్న విషయాలను నేర్చుకొని తన ఆశయాలను సాధించగలడు. చాలా మంది ప్రస్తుత పోటీ ప్రపంచంలో పరీక్షలలో నేగ్గాలన్న ఉద్దేశంతో పరీక్షలకోసం విషయాలను బట్టి పద్దతి ద్వారా నేర్చుకుంటున్నారు. అది చాలా ప్రమాదకరం. మనం మన జ్ఞాపక శక్తిని మెరుగుపర్చుకోవాకంటే కొన్ని పనులను అలవాటుగా చేసుకోవడం మంచింది.ఒక విషయాన్ని నేర్చుకోవడంలో శ్రద్ధ, ఏకాగ్రత ముఖ్యపాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ శారీరక వ్యాయామం తో పాటు పౌష్టికాహారం తీసుకోవాలి. ప్రతిరోజూ ధ్యానం చేయాలి. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస ఉంచడం.

మన మెదడు పని చేసే విధానం గురించి ఈ పుస్తకంలో అద్భుతంగా వివరించారు. మన మెదడు కొన్ని కోట్ల న్యూరాన్ల కలయిక. ఒక్కో న్యూరాన్ ఎంతో శక్తిమంతమైంది ఇవి కొన్ని సూపర్ కంప్యూటర్లతో సమానం. సమాచారం అంతా ఈ న్యూరాన్లలో నిక్షిప్తమై ఉంటుంది.

మన జ్ఞాపక శక్తిని మూడు రకాలుగా ఈ పుస్తకంలో వివరించారు.

1. తాత్కాలిక జ్ఞాపక శక్తి

2. స్వల్పకాలిక జ్ఞాపక శక్తి

3. దీర్ఘకాలిక జ్ఞాపక శక్తి

ప్రతిరోజూ చూసే, వినే విషయాలు కొన్ని నిమిషాలు లేదా కొన్ని గంటల వరకు మాత్రమే గుర్తుంటే అది తాత్కాలిక జ్ఞాపకశక్తి. కొంత శ్రద్ధ పెట్టిన విషయాలు కొన్ని రోజుల వరకు గుర్తుంటే అది స్వల్పకాలిక జ్ఞాపకశక్తి. ఈ స్వల్పకాలిక జ్ఞాపక శక్తే దీర్ఘకాలిక జ్ఞాపక శక్తిగా మారుతుంది. ఇలా మారడానికి పునశ్చరణ అత్యంత ఆవశ్యకం.

ఈ పుస్తకంలో కొన్ని మెమరి టెక్నిక్స్ లను కూడా వివరించారు వాటిని కూడా పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను .

1. <u>వర్గ విభజన పద్ధతి</u>

ఈ పద్ధతిలో మనం చాలా పదాలు గుర్తు పెట్టుకోవచ్చు. మొదటగా పదాలను ఒక వరుసలో ఉంచి వాటిలో ఏ పదాలు ఏ వర్గానికి చెందినవో విభజించాలి. ఆ వర్గంలో వాటికి సంబంధించిన పదాలు రాసి నేర్చుకోవాలి.

<u>2. విజువలైజేషన్ అండ్ లింకింగ్</u>

మన మెదడు ఒక విషయాన్ని గుర్తుంచుకుంటుందంటే అది మనకు తెలిసిన ఇతర విషయాలతో అనుసంధానం చేస్తుందని అర్థం. అంటే మనం ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవాలి అనుకుంటే ఏదైనా పాత విషయంతో అనుసంధానం చేయటం ద్వారా నేర్చుకోవచ్చు.

<u>3. శబ్దాక్షర పద్ధతి</u>

ఇది అంకెలు,అక్షరాలతో కూడుకొని ఉంటుంది. అంకెలను,అక్షరాలను ఉపయోగిస్తూ విజువలైజేషన్ అండ్ లింకింగ్ పద్ధతి ద్వారా విషయాలను గుర్తుంచుకోవచ్చు.

<u>4. రోమన్ రూమ్ పద్ధతి</u>

ఈ పద్ధతిని రోమన్లు కనుగొన్నారు. ఏదైనా బాగా తెలిసిన ప్రదేశం లేదా ఇల్లును మెమరి ప్యాలెస్ గా భావించి మెయిన్ డోర్, హాలు, వంటగది, స్టోర్ రూమ్, ఫ్రిజ్ ఇలా వరుస క్రమంలో గుర్తింపబడిన ప్రదేశాలతో మనం నేర్చుకోవాల్సిన విషయాన్ని అనుసంధానం చేసి గుర్తు పెట్టుకోవచ్చు.

5. నిమోనిక్స్ (జ్ఞాపకశక్తి సూత్రావళి)

ఈ పద్ధతిని ప్రాచీన గ్రీకులు అభివృద్ధి చేశారు. కొన్ని పదాల జాబితాను గుర్తు పెట్టుకోవాల్సి ఉన్నపుడు ఆ పదాల మొదటి అక్షరాలను అన్నింటినీ కలిపి ఒక వాక్యంగా తయారు చేసుకొని గుర్తించుకోవడం ఈ పద్ధతికి ఉదాహరణగా చెప్పవచ్చు.

ఈ పుస్తకం గురించి ఇలా చెప్తూ పోతే ఎంతైనా తక్కువే.. ఈ పుస్తకం చదివిన తర్వాత నేర్చుకోవటం ఇంత సులభమా అని అనిపించింది. మనకు ఊహా శక్తి యొక్క గొప్పతనం జ్ఞాపక శక్తిలో అది పోషించే పాత్రను నేను ఈ పుస్తకం ద్వారా తెలుసుకున్నాను. మెదడు సమాచారాన్ని ఎలా నిక్షిప్తం చేస్తుందో చాలా బాగా ఇందులో వివరించారు. అలాగే చాలా మెమరి టెక్నిక్స్ గురించి చర్చించారు. అందులో నాకు విజువలైజేషన్ అండ్ లింకింగ్, పెగ్ పద్ధతి, నిమోనిక్స్ పద్దతులు బాగా నచ్చాయి. వీటిని సాధన చేయడం ద్వారా మతిమరుపు పోయి, అద్భుతమైన జ్ఞాపకశక్తి మన సొంతం అవుతుంది. ప్రతి విద్యార్థి ఈ పుస్తకాన్ని చదివితే బాగుంటుందని నేను భావిస్తున్నాను. ఈ టెక్నిక్స్ పోటీ పరీక్షల్లోనూ బాగా ఉపయోగపడతాయి. ఒక వ్యక్తికి నేర్చుకోవాలనే ఆసక్తి, ఉత్సుకత ఈ పుస్తకం పెంపొందిస్తుంది.

# ౬. ఉషాపరిణయం(నాటకం)

సమీక్షకులు: మాధవి

రచయిత : తడకమళ్ళ రామచందర్ రావు

బిఎస్సీ ద్వితీయ సంవత్సరం(ఎంపిసిఎస్)

ఉషాపరిణయం అనే నవల భారతీయ ప్రసిద్ధ నాటకాల్లో సుప్రసిద్ధమైనది. ఈ నాటకాన్ని 1901 వ సంవత్సరంలో తడకమళ్ళ రామచందర్ రావు గారు రాశారు.

**నాటకం లోని ముఖ్య పాత్రలు:~**

ఉష - బాణాసురుని కూతురు

అనిరుద్ధుడు - శ్రీకృష్ణుని మనవడు

చిత్రలేఖ - ఉష కు అత్యంత ప్రియమైన సఖి

శివుడు , పార్వతి

**సారాంశం:~**

రాక్షసుల రాజు బాణాసురుడు శివుని ఆశీర్వాదం కోసం తీవ్రమైన తపస్సు చేస్తాడు. శివుడు బాణాసురుడు కి కనిపించి తన కోరికను వెల్లడించమని అడగగా, బాణాసురుడు శివ పార్వతుల తో సహా వారి మొత్తం కుటుంబాన్ని వాళ్ల నగరమైన సోనాపూరి కి కాపలాగా ఉండమని అడుగుతాడు. బాణాసురుడి యొక్క కోరికను కాదనలేక శివుడు తన మొత్తం కుటుంబంతో సహా సోనాపురి కి చేరుకుంటారు. ఇది అహంకారి బాణాసురుడు కి మితిమీరిన సంతోషాన్ని ,విశ్వాసాన్ని ఇస్తుంది. బాణాసురుడు దేవతలపై యుద్ధం చేస్తాడు.

బాణాసురుడు కి శివుడి యొక్క శక్తి అండగా ఉండడం మూలంగా ప్రతిసారి దేవతలు పరాజయాన్ని పొందుతుంటారు.

బాణాసురుని అందమైన కుమార్తె ఉష. తన తండ్రి కోట ప్రవేశద్వారం వద్ద ఉన్నటువంటి శివపార్వతులకు నమస్కరిస్తుంది. ఉష పార్వతీదేవి నుండి నాట్యకళను నేర్చుకుంటుంది. ఒకరోజు ఉష నిద్ర లోకి జారుకోగా ఆమె కలలో ఒక అందమైన యువకుడితో సన్నిహితంగా ప్రేమలో ఉన్నట్టు అనిపిస్తుంది. అది కలో లేక వాస్తవమో అని ఆమె గుర్తించలేకపోయింది.

ఉష ను కలవడానికి తన ప్రియ స్నేహితురాలు చిత్రలేఖ రాజభవనానికి వస్తుంది. చిత్ర లేఖ ఉష తో సంభాషించి, అక్కడి పరిస్థితిని అర్థం చేసుకుంది. తన కలల యువకుడు చిత్రాన్ని గీయడానికి తనను ఒప్పిస్తుంది. చిత్రలేఖ గీసిన చిత్రాలు చూసి వెంటనే అందులో ఉన్నది శ్రీ కృష్ణుడి మనవడు అనిరుద్ధుడే అని ఉష గుర్తిస్తుంది. చిత్రలేఖ ద్వారకానగరానికి ప్రవేశించి ,నిద్రలో ఉన్న అనిరుద్ధుడిని చూసి మంచం తో సహా తన ప్రియ స్నేహితురాలు వద్దకు తీసుకు వస్తుంది. నిద్ర నుంచి మేల్కొన్న టువంటి అనిరుద్ధుడు ఉష అందాన్ని చూసి ఆమె అందానికి ముగ్ధుడవుతాడు. చిత్రలేఖ వీళ్ళిద్దరికీ దగ్గరుండి గాంధర్వ వివాహం జరిపిస్తుంది. కానీ ఉష పెళ్లి విషయం తన తండ్రికి తెలుస్తుందని నిరంతరం భయపడుతూనే ఉంటుంది కానీ తన స్నేహితురాలు చిత్ర లేఖ ధైర్యం చెబుతుంది.

కొన్ని రోజులకు బాణాసురుడు ఉష కు పెళ్లి నిశ్చయిస్తాడు. చెలికత్తెల ద్వారా ఉష అనిరుద్ధుడుల వివాహం గురించి బాణాసురుడికి తెలుస్తుంది. అనిరుద్ధుడు శ్రీకృ ష్ణుడి మనవడు అని తెలుసుకొని ఉషను రాజ భవనం నుంచి గెంటి వేస్తాడు.

శివుడి అండ ఉందని విర్రవీగుతున్న బాణాసురుడు శ్రీ కృష్ణుడితో యుద్ధం చేయాల్సిందే అని నిర్ణయించుకుంటాడు.

యుద్ధం జరిగే సమయం ఆసన్నమైంది శివుడు మరియు శ్రీకృష్ణుడు తమతమ శస్త్రాలు తీసుకొని యుద్ధానికి పరుగులు తీస్తారు.  కానీ శివుడు ప్రయోగించిన ఏ శస్త్రాలు కృష్ణుడి పై ప్రభావం చూపవు. అది తెలుసుకున్న బాణాసురుడు ఇక లాభం లేదు అని శ్రీ కృష్ణుని గొప్పదనాన్ని తెలుసుకొని అతని కాళ్ల మీద పడతాడు.

కథలో నాకు నచ్చిన పాత్ర:

ఈ కథలో నాకు చిత్రలేఖ పాత్ర బాగా నచ్చింది ఎందుకంటే తన స్నేహితురాలి కోసం ద్వారక కి వెళ్లడం,  స్నేహితురాలి మనసును అర్థం చేసుకోవడం వంటివి నాకు బాగా నచ్చాయి. అంతేకాకుండా చిత్ర లేఖ లో ఉన్న మంత్ర శక్తి వల్ల ఏదైనా చేసే తత్వం నాకు బాగా నచ్చింది.

నాటకాలు చదువుతుంటే తర్వాత ఏం జరుగుతుందో అనే ఆసక్తి కలుగుతుంది. అందులో ఉన్న పాత్రలు స్వయంగా మనతో మాట్లాడుతున్నట్టు అనిపిస్తుంది. అనేక పురాణ సంబంధిత విషయాలు పరిచయం అవుతాయి. అనేక సాంప్రదాయాలు, కట్టుబాట్ల గురించి తెలుసుకోగలుగుతాం. నేడు టెలివిజన్లు వచ్చాక నాటక కళ మరుగున పడిపోయింది. దాన్ని నిలబెట్టడం కోసం ఇటువంటి పుస్తకాలు చదవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది.

# 7. ప్రేరణాత్మక కథలు

సమీక్షకులు: పుష్ప సేకరణ : గురుకుల ఫౌండేషన్

బిఎస్సీ ద్వితీయ సంవత్సరం(ఎంపిసిఎస్)

ప్రజల వ్యవహారంలో ఉన్న కొన్ని కథలను గురుకుల ఫౌండేషన్ వారు సేకరించి ప్రచురించిన పుస్తకమే ఈ ప్రేరణాత్మక కథలు. ఈ పుస్తకంలో చాలా కథలు అద్భుతమైన ప్రేరణను అందిస్తున్నాయి. వీటిలో చద్ది అన్నం అనే కథ నాకు చాలా బాగా నచ్చింది. ఈ కథలో ఒక కుటుంబం, అందులో ఒక సోమరిపోతు ఉంటాడు. ఈ సోమరిని ఉద్దేశించి కథ మొత్తం నడుస్తుంది.

**సంక్షిప్త కథ:**

ఒక గ్రామంలో ఒక తల్లి తన కొడుకు, కొడలితో కలిసి నివసిస్తూ ఉంటుంది. కొడుకు రోజు ఏ పని లేకుండా జులాయిగా బయట తిరుగుతూ ఉంటాడు. కానీ భోజనం సమయానికి ఇంటికి వచ్చి భోజనం చేస్తుంటాడు. తల్లి కొడుకుకి వేడి అన్నం పెడుతూ తాను చద్దన్నం తినేది కానీ కొడుకుకు మాత్రం 'నీకు చద్దన్నం పెడుతున్న' అనే చెప్పేది. కొన్ని రోజుల తర్వాత నిజం తెలుసుకున్న కొడుకు తల్లిని అడిగితే రాత్రి వండింది పొద్దున చద్దన్నం, పొద్దున వండింది రాత్రికి చద్దన్నం అవుతుంది. అలాగే నాన్న సంపాదించింది తినటం అనేది చద్దన్నం లాంటిది, స్వయంగా నువ్వు సంపాదించింది వేడి అన్నం లాంటిది అని తల్లి చెబుతుంది దాంతో కొడుకు తనలోని లోపాన్ని తెలుసుకుంటాడు.

**పుస్తకం పై నా అభిప్రాయం:**

ఈ కథ శీర్షికను బట్టి కథలో చద్ది అన్నానికి సంబంధించిన సమాచారం ఉంటుంది అనుకున్నాను. కానీ చద్ది అన్నం తో పోల్చుతూ గొప్పనీతిని రాబట్టారు. ఈ పుస్తకంలోని అన్నీ కథలు కూడా వివిధ ఉదాహారణలతో అనేక నీతులను బోధించేవిగా ఉన్నాయి.

ఈ కథ ఆధారంగా మనం తెలుసుకోవాల్సింది పూర్వుల ఆస్తులపై ఆధారపడకుండా, కష్టపడి కుటుంబాన్ని పోషించాలి అని తెలుస్తుంది. పెద్దయ్యాక కూడా తల్లిదండ్రుల సంపాదనపై ఆధారపడకుండా సొంతంగా కష్టపడాలి అని ఈ కథ నుండి తెలుసుకోవచ్చు.
ఈ పుస్తకంలోని కథలు చాలా చిన్నవైనా అద్భుతమైన అర్థాన్ని ఇచ్చేవిగా ఉన్నాయి. పాఠకులు చదివేటప్పుడు విసుగు చెందకుండా తక్కువ సమయంలోనే ఎంతో ఎక్కువ సమాచారాన్ని, నీతిని వివరిస్తాయి.

ముఖ్యంగా ఈ పుస్తకం లోని కథలను చిన్నపిల్లలకు చెప్పడానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. పిల్లలకు చిన్నప్పటి నుండే అనేక నైతిక విషయాలను ఈ కథల ద్వారా నేర్పించవచ్చు. పిల్లల్లో ఉన్న వారి వారి అభిరుచులను వెలికితీసి వాటిలో ప్రతిభ కనబర్చేలా ప్రోత్సాహం ఇవ్వవచ్చు.

# 8. కన్యాశుల్కం (నాటకం)

సమీక్షకులు: బి. నవ్య

రచయిత : గురజాడ అప్పారావు

బిజెడ్ సి  ద్వితీయ సంవత్సరం

కన్యాశుల్కం అనేది గురజాడ అప్పారావు రచించిన ఒక తెలుగు నాటకం. ధనానికి లోబడి ఆడపిల్లలని ముసలివారికి అమ్ముకోవడం అనే దురాచారమే కన్యాశుల్కం. ధనాశతో ఆడపిల్లలను చిన్నతనంలోనే ముసలివాళ్ళకి ఇచ్చి పెళ్లి చేయడం అనే దురాచారాన్ని ఇందులో వివరించారు.

**సారాంశం** :

పూర్వం ఐదేళ్ళకే బాలికలకి పెళ్ళి చేసేవారు . ఈ అన్యాయాన్ని గురజాడ ఈ నవలలో ఎత్తి చూపారు . పసిపిల్లల్ని ముసలివాళ్ళకిచ్చి పెళ్ళిచేస్తే కొన్ని రోజులకే భర్త చనిపోతే వారు బాలవితంతువులుగా జీవితాంతం ఉండాల్సి వచ్చేది. ఈ దురాచారాన్ని ఎత్తి చూపుతూ రాసిన నాటకమే ఈ కన్యాశుల్కం.

అగ్నిహోత్రావధాన్లు తన చిన్న కుమార్తెకు చిన్నతనంలోనే ధనాశతో కన్యాశుల్కం తీసుకుని ముసలివాడైన లుబ్ధావధాన్లకు రామప్పంతులు మధ్యవర్తిత్వంతో పెళ్ళిచేయాలని అనుకుంటాడు. తన మేనకోడలిని ఆ పెళ్లి నుండి తప్పించేందుకు అగ్నిహోత్రుని బావమరిది కరటకశాస్త్రి గుంటూరు శాస్త్రులుగా పేరుమార్చుకుని రామప్పంతులు వద్ద ఉంటున్న మధురవాణి సహాయంతో తన శిష్యుడికి ఆడవేషం వేసి లుబ్ధావధాన్లకు ఇచ్చి పెళ్ళిచేస్తారు. గుంటూరుశాస్త్రి, మారువేషంలోని శిష్యుడు కన్యాశుల్కంతో పారిపోతారు. నిజాయితీపరుడు అయిన సౌజన్యరావు పంతులు దీన్ని పరిష్కరించడంతో నాటకం ముగుస్తుంది.

కన్యాశుల్కం అనగానే హాస్యం గుర్తొస్తుంది . నాటకంలో పాత్రలే ఒకరికి ఒకరు వింత పేర్లు పెట్టుకొని పిలుచుకుంటారు . గిరీశం అగ్నిహోత్రావధానిని " అగ్గిరావుడ " అన్నాడు . కరటక శాస్త్రి " మూర్ఖపగాడే కొడుక " అన్నాడు . గిరీశాన్ని రామప్పంతులు " గిర్రడు " " బొట్లేరు " అని అన్నాడు . అగ్నిహోత్రావధాన్లు కూడా గిరీశాన్ని " హనుమాన్లు " గా అన్నాడు. ఇటువంటి మాటలు ఈ నాటకంలో వింటున్నప్పుడు కడుపుబ్బా నవ్వుకుంటాం.

**శైలి:**

నాటక రచనా కాలానికి నాటకాల్లో అరుదుగా కనిపించే సజీవమైన వాడుకభాషనే నాటక రచనకు వినియోగించుకున్నాడు గురజాడ.

**నా అభిప్రాయం:**

వితంతు వివాహం, కన్యాశుల్కం వంటి మొదలైన ఎన్నో సాంఘిక అలవాట్లను ఈ నాటకం ద్వారా రచయిత వివరించారు. హాస్య శైలితో అలరించే ఈ నాటకం అనేక సాంఘిక దురాచారాలను వివరించేదిగా ఉంది. నేటి తరం ఈ నాటకాన్ని చదివి అవగాహన చేసుకొని సాంఘిక దురాచారాలను పారదోరాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ౨. మన పండుగలు

**సమీక్షకులు: మహేశ్** రచయిత : బండారు సదాశివరావు

బిఎస్సీ ద్వితీయ సంవత్సరం(ఎంపిసిఎస్)

మన సంస్కృతి సంప్రదాయాల భావాలను నేటి తరానికి పరిచయం చేయడమే మన పండుగలు పుస్తక ముఖ్య ఉద్దేశ్యం. మన సనాతన సంస్కృతిని కాపాడటం మనం జరుపుకునే పండగలు, ఉత్సవాల వల్లనే సాధ్యం అని నా అభిప్రాయం. అటువంటి పండగల ప్రాముఖ్యతను ఈ మన పండుగలు పుస్తకం వివరిస్తుంది. ఈ పుస్తక రచయిత శ్రీ బండారు దత్తాత్రేయ గారు.

నేను చదివిన కొన్ని పండగల ప్రాముఖ్యతలను సంక్షిప్తంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

1. <u>ఉగాది</u>

ఉగస్య ఆది అనేదే **ఉగాది.** "ఉగ" అనగా నక్షత్ర గమనం - జన్మ - ఆయుష్షు అని అర్థాలు. వీటికి 'ఆది' అనగా మొదలు 'ఉగాది'. అనగా ప్రపంచం జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయింది. ఇంకొకవిధంగా చెప్పాలంటే, 'యుగం' అనగా రెండు లేక జంట అని కూడా అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే ఆయన ద్వయ సంయుతం 'యుగం' (సంవత్సరం) కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయింది. అదే సంవత్సరాది. ఉగాది - వసంతాలకు గల అవినాభావ సంబంధం, సూర్యునికి సకల ఋతువులకు ప్రాతః సాయం కాలాది త్రికాలములకు ఉషాదేవతయే మాతృస్వరూపం. భారతీయ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణైతికంగా చెప్పబడింది.

1. <u>గురు పూర్ణిమ</u>

ఉపాధ్యాయులను, పెద్దలను పూజించే రోజును గురు పౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి  అని పిలుస్తారు. హిందువులు ప్రతి సంవత్సరం ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమి జరుపుకుంటారు. ఈ రోజున గురుపూజోత్సవం జరిపి గురువులకు కానుకలు బహుమతులు సమర్పించి వారిని సత్కరించి వారి ఆశీర్వాదములు తీసుకొంటారు. తమ జీవితానికి మార్గనిర్దేశం చేసి, ముక్తి వైపు నడిపించివందుకు ప్రతిఫలంగా ఇలా చేస్తారు.గురువుల పట్ల ఇదే గౌరవం అన్నివేళలా పాటిస్తున్నప్పటికీ ఈ రోజు వ్యాస మహాముని పుట్టిన రోజు కాబట్టి ఈ రోజుకంత ప్రాధాన్యత ఉంది.ఈ రోజున చాలామంది ప్రజలు రోజు పొడవునా ఉపవాసం ఉంటారు. సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి, చంద్రోదయం వేళకు ఉపవాసం ముగిస్తారు. చంద్రోదయాన్ని చూసిన తర్వాత లేదా సాయంత్రం పూజలు ముగిసిన తర్వాత ఉపవాసకులు ఆహారం స్వీకరిస్తారు.

1. <u>రక్షా బంధన్</u>

*రాఖీ*, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పౌర్ణిమ అని కూడా పిలుస్తారు.  అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండగను జరుపుకుంటారు. కొంతకాలం క్రితం వరకూ ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకునేవారు. ఇప్పుడు దేశమంతా జరుపుతున్నారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ. అది చాలా ఉత్సాహంతో జరుపుకుటూరు.సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈ రోజునే పాతది వదిలి కొత్త దానిని ధరిస్తారు..

**సంక్రాంతి:**

సంక్రాంతి అనగా నూతన క్రాంతి . సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు.అయితే ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారు. అయితే మనకు పన్నెండు రాశులు ఉన్నాయి.ఆ పన్నెండు రాశులలోకి సూర్యుడు ప్రవేశించే క్రమంలో మనకు పన్నెండు సంక్రాంతులు వస్తాయి. సూర్య సంక్రమణం జరిగేటపుడు సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ సంక్రాంతి అంటారు. ఇలా ప్రతి మాసం ఒక సంక్రాంతి ఉంటుంది. సౌరమాన కాలెండరులో ప్రతినెల ఒక సంక్రాంతితో ప్రారంభమవుతుంది నవ్యాంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్టాలలో ప్రముఖంగా జరుపుకుంటారు. ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు బోగిమంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో అలాగే మాంసప్రియులకు మంచి కూరలతో, మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుంది.

ఈ పుస్తకంలో అన్నీ పండగల గురించి చాలా సమగ్రమైన సమాచారం ఉంది. ఒక నాలుగు పండగల సంక్షిప్త పరిచయం మాత్రమే నేను చేశాను. కానీ ఒక్కో పండగ గురించి లోతుగా చదువుతూపోతే మన సంస్కృతి, సాంప్రదాయాలను క్షుణ్ణంగా పరిశీలన చేసినవాళ్లం అవుతాం. మన సంప్రదాయాలకు దూరంగా పోతున్న నేటి యువత తప్పకుండా చదవాల్సిన పుస్తకం ఇది.

# 10. అందరినీ ఆకట్టుకునే కళ

సమీక్షకులు: ఉమారాణి రచయిత :డెల్ కార్నెగీ

బీఎస్సీ ప్రథమ సంవత్సరం(ఎంపిసిఎస్)

'అందరిని ఆకట్టుకునే కళ' పుస్తకాన్ని డెల్ కార్నెగీ రచించారు. అందరితో ఎలా మాట్లాడాలి, సమాజంతో ఎలా మెలగాలి, స్నేహాన్ని ఎలా ఏర్పరచుకోవాలి అనే విషయాలు చాలా వివరంగా ఇందులో వివరించారు. డెల్ కార్నెగీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక మంది జీవిత చరిత్రలను సంకలనం చేసి వాటిలో ప్రేరణను కలిగించే సంఘటనలను ఏరి ఈ పుస్తకంలో రాశాడు. గొప్ప గొప్ప వ్యక్తుల ఇంటర్వ్యూ సంఘటనలను ఇందులో కూలంకుషంగా వివరించారు. వాటిలో కొన్నింటిని నేను ఇక్కడ వివరించే ప్రయత్నం చేస్తాను.కరుడుగట్టిన నేరస్థుడు అంటే రెండు మూడు మర్డర్లు చేసిన వ్యక్తి ఓ మాట అన్నాడట నేను నేరాలు చేశాను కానీ ఇదిగో ఫలానా మంచి కోసం చేశాను కావాలని చేయలేదు అని. కరుడుగట్టిన నేరస్తుడే తన తప్పుని ఒప్పుకోనపుడు చిన్న చిన్న తప్పులు చేసే సామాన్యులు ఎందుకు ఒప్పుకుంటారు అందుకనే ఆయన ఏమంటాడంటే ఎవ్వరూ తప్పులను ఒప్పుకోరు కాబట్టి ఎవరినీ తప్పు పట్టకండి, ఎవరిని విమర్శించకండి, ఎవరిని నిందించకండి, ఎవరి కోణంలో వారు సరైన వాళ్ళు. డెల్ కార్నెగీ ప్రకారం ఆలోచించినట్లయితే మనం కూడా అంతే కదా ఉదాహరణకు అక్కడ ఒక గ్లాసు నీళ్ళు ఉన్నాయి అనుకుందాం వాటిని చిన్న పిల్ల వాడు తన్నేశాడంటే అప్పుడు మనం అరే కళ్ళు నెత్తి కెక్కాయా అని అంటాం. అదే గ్లాసు మనం తన్నాము అనుకో అప్పుడు ఎవడ్రా గ్లాసు అడ్డం పెట్టాడు అంటాం. ఇక్కడ అదే నీటి గ్లాసు, అదే తన్నుడు కానీ ఒక్కో సందర్భంలో ఒక్కోలాగా ప్రతిస్పందించాం.

అందుకనే ఎవరి ఆలోచనలు వారివి ఎవరిని నిందించకు మరి ఎవరికైనా చెప్పాల్సి వస్తే మెల్లిగా తీయగా చెప్పు అని డెల్ కార్నెగీ అంటాడు.ఒక కార్యాలయంలో ఒక అతని కింద 300 మంది పనిచేస్తున్నారు ఆ కార్యాలయం లో అతని ప్రతి రోజు నువ్వు ఇది చేయలేదు అది చేయలేదు అని అందరిని తిట్టడం చేస్తుంటాడు కానీ అతడు ఈ పుస్తకం చదివిన తర్వాత లేదా డెల్ కార్నెగీ ఉపన్యాసాలు విన్న తర్వాత వాళ్లకు తియ్యగా చెప్పడం మొదలు పెట్టాడట. సింగరేణి కర్మాగారం లో నిర్వాహకుడిగా పనిచేస్తున్న వ్యక్తి ఉద్యోగుల భద్రత విషయంలో అందరూ హెల్మెట్లు ధరించేట్లు చేయాలి కాబట్టి అతను 'మీకు ఎన్ని సార్లు చెప్పాలి హెల్మెట్లు పెట్టుకోమని ఒకసారి చెప్తే అర్థం కాదా' అనేవాడు కానీ ఈ పుస్తకం చదివిన తర్వాత డెల్ కార్నెగీ ఉపన్యాసాలు విన్న తర్వాత ఆయన మాట స్వభావం మారిపోయిందట. ఎలా అంటే హెల్మెట్ పెట్టుకోలేదెందుకు నీకేమైనా తల నొప్పిగా ఉందా లేదా చిన్నగా అయిందా హెల్మెట్, సౌకర్యంగా లేదా, వేరే హెల్మెట్ ఇవ్వాలా అంటే అది పసుపు రంగు కదా పోనీ ఎరుపురంగు చేయమంటారా అని మాట్లాడటం మొదలు పెట్టాడట.

ఇలా ఈ పుస్తకం చదివిన ప్రతీ ఒక్కరి మాట తీరు అద్భుతంగా మారుతుంది కాబట్టి ప్రతిఒక్కరం ఈ పుస్తకం చాదువుదాం చదివింపచేద్దాం.





